# సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

## జూనియర్ సివిల్ జడ్జి హేమలత



**శివ్వంపేట, మే 17 సిరి న్యూస్ :**
గ్రామాల్లో భారత ప్రభుత్వ చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జ్, మండల లీగల్ సర్వీస్ కమిటి చైర్పర్సన్ ఎం.హేమలత అన్నారు. ఇవాళ శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామంలో రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేయగా జడ్జి హేమలత హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులే దేశానికి వెన్నుముకలాంటివారని.. అలాంటి రైతులకు ఒక్కోసారి ఫర్టిలైజర్ దుకాణదారులు కల్తీ విత్తనాలు ఇస్తే వాటిపై జరిగిన నష్టంపై కన్జ్యూమర్ ఫోరం ద్వారా రైతు నష్టపరిహారాన్ని పొందవచ్చన్నారు. రైతలు పంటపొలాల సమస్యతోగానీ, ఆర్థికపరమైన సమస్యతో కానీ అధైర్యపడిఆత్మహత్యలకు పాల్పడొద్దన్నారు. భూములకు సంబంధించిన ఏదైనా చట్టపరమైన సమస్యలు తలెత్తినప్పుడు న్యాయ సహాయం కోసం తమ లీగల్ కమిటీని ఆశ్రయిస్తే న్యాయం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు చిన్నపిల్లలకు మోటార్‌వాహనాలు ఇవ్వొద్దని, బాల్యవివాహాలు చేయరాదన్నారు. ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి అస్సలు వాహనాలు నడుపొద్దన్నారు. గ్రామాల్లో కల్తీ మద్యం, కల్తీ కల్లు విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్‌గౌడ్, న్యాయవాది స్వరాజరాణి, లోక్‌అదాలత్ బెంచ్ మెంబర్ మధుశ్రీ శర్మ, ఎంపీడీఓ నాగేశ్వర్‌రావు, ఏఎస్సై అంతన్నగారి సాయిలు, ఏఈఓ మౌనిక, న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభు, రాజునాయక్, డి.శ్రీధర్‌రెడ్డి, ప్రకాశ్, కేవి శ్రీనివాస్‌రావు, సాయిరాం, లీగల్ సర్వీస్ సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.

# డిగ్రీ ఫెయిలైన విద్యార్థులకు మరో అవకాశం

**అందోల్, మే 17 సిరి న్యూస్ :**




జోగిపేట నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో 2016–17 నుంచి 2019–20 బ్యాచ్‌లో 1వ సెమిస్టర్ నుంచి 6వ సెమిస్టర్ వరకు పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు తిరిగి బ్యాక్‌లాగ్స్ పరీక్షలు రాసేందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం అనుమతినిచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ డా. రమేశ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమేశ్ డా. రమేశ్ సూచించారు. ఎలాంటి ఫైన్ లేకుండా మే 19 వరకు.. ఫైన్‌తో 29 వరకు పరీక్ష ఫీజులు చెల్లించే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఈ విషయాన్ని గుర్తించి.. సకాలంలో ఫీజులు చెల్లించి పరీక్షలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలన్నారు.

# మంచి నీటి పైపు లైన్ పనులకు శంకుస్థాపన

**పటాన్ చెరు, మే 17 (సిరి న్యూస్):**



పటాన్‌చెరువు డివిజన్‌పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలో గల అపార్ట్‌మెంట్ వాసుల కోసం రూ.20 లక్షలతో చేపట్టనున్న రక్షిత మంచి నీటి పైపులైను పనులకు స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం, ఇతర అవసరాల కోసం తాను ఎప్పుడూ ముందుటానని ఆయన ఆనందర్భంగా స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పోరేటర్ మెట్టు కుమార్ యాదవ్, కాలనీ అధ్యక్షులు అమరేందర్, ప్రధాన కార్యదర్శి మాణిక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మధుర జ్ఞాపకం

## ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దిన భవనం

## నేడు ఉన్నత స్థానాలలో అప్పటి విద్యార్థులు

**గుమ్మడిదల, మే 17 సిరి న్యూస్**



వేలాదిమంది విద్యార్థులకు విద్యనందించి ఉన్నతమైన స్థానాలలో నిలబెట్టిన పాఠశాల భవనం. ఆనాడు మండలంలో కేవలం గుమ్మడిదల గ్రామంలో ఈ ఒక్క పాఠశాల భవనం ఉన్నది. ఇక్కడికి గుమ్మడిదలకు చుట్టుపక్కల గ్రామాలైన కానుకుంట, మంబాపూర్ , కొత్తపల్లి, నల్లవల్లి, బొంతపల్లి, అన్నారం, దోమడుగు గ్రామాల నుండి చదువుకునేందుకు ఇక్కడికి వచ్చేవారని విద్యను అభ్యసించిన విద్యార్థులు తెలిపారు. ఈ భవనంలో చదివిన ఎంతోమంది విద్యార్థులు ప్రస్తుతం ప్రభుత్వ ప్రైవేటు సంస్థలలో ఉన్నత కొలువుల్లో ఉన్నారు. డాక్టర్లు, ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులు, ఇంజనీరింగ్ లుగా వివిధ సంస్థలలో పనిచేయుచున్నారు. ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయులు సైతం ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. ప్రస్తుతం ఆ భవనం యొక్క ఆనవాళ్లు ఏమీ లేవని చెప్పవచ్చు. శిలావస్థకు రావడంతో పూర్తిగా ఆ భవనాన్ని తొలగించి నూతన భవనాలను ఏర్పాటు చేశారు.

# వర్షాలతో రైతులకు ఇబ్బందులు..

## వేగంగా ధాన్యం తూకం వేయాలి

## తహసీల్దార్ బాలలక్ష్మి


**వెల్దుర్తి, మే 17 సిరి న్యూస్:**



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తూకాన్ని వేగంగా చేయాలని తహసీల్దార్ బాలలక్ష్మి అన్నారు. శనివారం వెల్దుర్తిలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రంతోపాటు శివసాయి రైస్‌మిల్లులను తహసీల్దార్ ఆర్ఐ నర్సింగ్‌యాదవ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా హమాలీలతో మాట్లాడిన తహసీల్దార్ ధాన్యం తూకం వేగంగా చేయాలని, వర్షాలు పడుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే ధాన్యం తడిసిపోవడంతో ఆరబెట్టడానికి కూలీలు అవస్థలు పడుతున్నారన్నారు. కావున వరుస క్రమంలో ధాన్యాన్ని తూకం వేసి వాహనాలలో రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. అలాగే రైస్‌మిల్లు యజమానులతో మాట్లాడుతూ..వాహనాలను రైస్‌మిల్లుల వద్ద నిలువ ఉంచుకోకుండా తగినంత మేర హమాలీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని త్వరత్వరగా దించుకొని రైతులకు సహకరించాలని సూచించారు.

# కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం

**చేగుంట, మే 17 సిరి న్యూస్**



చేగుంట మండలం రుక్మపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బోయిని మురళి మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని కాంగ్రెస్ యూవ నాయకులు సంద్రుగు శ్రీకాంత్ పరామర్శించారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయం, 50కేజీ ల బియ్యం అందజేశారు ఈ కార్యక్రమంలో రుక్మపూర్ గ్రామ అధ్యక్షుడు అంజ గౌడ్,మ్యాకల పరమేష్,అక్కానగారి సాయికుమార్ మ్యాకల నాగయ్య , మ్యాకల స్వామి,చాకలి రమేష్,చిట్టపొరం భిక్షం ,గజ్జల సాయిలు,సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.